ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 26 మార్చి 2024

చంద్రబాబు పర్యటన వివరాలను వెల్లడిస్తున్న ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా



చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

● రేపు సాయంత్రం మదనపల్లెలో సభ

మదనపల్లె టౌన్, మార్చి 25: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బుధవారం సాయంత్రం మదనపల్లెలో పర్యటించనున్నారని, స్థానిక బెంగళూరు బస్టాండులో నిర్వహించే బహిరంగ సభను టీడీపీ శ్రేణులు విజయవంతం చేయాలని మదనపల్లె టీడీపీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక షాజహాన్‌బాషా నివాసం వద్ద చంద్రబాబు పర్యటన షెడ్యూల్‌ను షాజహాన్‌బాషా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం పుత్తూరు సభ ముగించుకుని హెలికాప్టర్‌లో బయలుదేరే చంద్రబాబు పట్టణంలోని బీటీ కళాశాల మైదానంలోని హెలిప్యాడ్‌లో సాయంత్రం 4.30 గంటలకు దిగుతారన్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన పట్టణంలోని బెంగళూరు బస్టాండుకు చేరుకుని ఇఫ్తార్ విందులో పాల్గొంటారన్నారు. అనంతరం బెంగళూరు బస్టాండులో సాయత్రం 6.30 గంటలకు బహిరంగ సభలో చంద్రబాబు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. సభ అనంతరం శ్రీరామ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన బస వద్ద ప్రత్యేక బస్సులో రాత్రి బస చేస్తారన్నారు. మదనపల్లె నియోజకవర్గ ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు సభను విజయవంతం చేయాలని షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు విద్యాసాగర్, నీలకంఠ, సంగం శ్రీనివాసులు, ఎస్ఎం రఫి, ఎస్‌ఏ మస్తాన్, జంగాల శివరాం, సుధాకర్, మాజీ కౌన్సిలర్లు మహాలక్ష్మి, రాధ, లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

అవి ప్రభుత్వ హత్యలే..

- ● వైసీపీకి తొత్తులుగా ఉన్న అధికారులపై చర్యలు తప్పవు
- ● మాజీ మంత్రి కొల్లు రవీంద్ర
- ● రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం
- ● తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు
- ● రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- ● కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్



ఆత్మహత్య చేసుకున్న పాల సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టీడీపీ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు

ఒంటిమిట్ట, మార్చి 25 : చేనేత కార్మికుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని సోమవారం సాయంత్రం టీడీపీ నిజనిర్ధారణ కమిటీ పరామర్శించింది. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు, తొగట సాధికారిక కమిటీ కన్వీనర్ మడక చక్రధర్, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కుటుంబానికి టీడీపీ నాయకులు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఘటన జరిగిన విషయాన్ని పెద్ద కూతురు లక్ష్మీప్రసన్న ద్వారా టీడీపీ నాయకులు వివరాలు సేకరించారు.

అధికారులపై చర్యలు తప్పవు

వైసీపీ నాయకులకు తొత్తులుగా ఉన్న అధికారులపై చర్యలు తప్పవని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన అధికారులపై విచారణ చేపడతామని తెలిపారు. అధికార పార్టీ వారు కానీ అధికార యంత్రాంగం కాని ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారా, ప్రభుత్వం నుంచి ఏమి హామీ ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. పాల వెంకటచలపతి పేరుతో ఉన్న రికార్డులను ట్యాంపరింగ్ చేసి అన్యాయం చేశారన్నారు. క్రికెట్ బెట్టింగ్, జూదం ఇతర వ్యసనాల వల్ల చనిపోయారని అధికారులు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో వందమంది బీసీలను వైసీపీ ప్రభుత్వం హత్య చేసిందని, ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్‌ను చంపి కారులో ప్యాక్ చేసి ఇంటికి పంపడం, నందం సుబ్బయ్యను హత్య చేయడం, అక్క కోసం ప్రశ్నించిన అమర్‌నాథ్ గౌడ్‌ను హత్య చేయడం, ముస్లిం మైనారిటీ నాయకుడు అబ్దుల్ సలాం ఆత్మహత్య, మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను హింసించి చంపడం వంటివి రాష్ట్రంలో బరి తెగించిపోయాయని వీటికి ఎవరు బాధ్యులని వారు ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే బీసీల కోసం బీసీల పరిరక్షణ చట్టాన్ని తెస్తామని తెలిపారు.

రాష్ట్రంలో బీసీలకు రక్షణ కరువైందని రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. పేద కుటుంబం ఆత్మహత్య చేసుకుంటే ఇతర కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారని అధికారులు ప్రకటించడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో బీసీల మాన, ప్రాణాలు, ఆస్తులకు రక్షణ లేకుండాపోయిందని మరో 50 రోజుల్లో టీడీపీ ప్రభుత్వం రానుందని బీసీలకు స్వేచ్ఛా వాతావరణం వస్తుందని, అందుకోసం ప్రతి ఒక్క బీసీ నాయకుడు టీడీపీకి మద్దతు పలకాలని ఆయన పిలుపునిచ్చారు.

కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ

కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ ప్రభుత్వమని పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆస్తులకు వైసీపీ ప్రభుత్వంలో రక్షణ కరువైందని ఎక్కడ చూసినా భూఆక్రమణలు దోపిడీలే తప్ప రాష్ట్రంలో అభివృద్ధి కనబడలేదన్నారు. తల్లి, తండ్రి, చెల్లెల్ని కోల్పోయి అనాథగా ఉన్న లక్ష్మీప్రసన్న కుటుంబాన్ని చూస్తుంటే రాష్ట్రంలో వైసీపీ అరాచకం ఏ విధంగా ఉందో కళ్లకు కట్టినట్లు కనబడుతుందని ఆయన అన్నారు. బలహీన వర్గాలకు, బీసీలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు.

కుటుంబానికి అండగా ఉంటా..

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆత్మహత్యకు పాల్పడిన పాల సుబ్బారావు పెద్ద కుమార్తె లక్ష్మీప్రసన్నతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ మీ కుటుంబానికి అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని తెలిపారు. సొంత చెల్లిలాగా చూసుకుంటానని, పోరాటం ద్వారా వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. మీకు దక్కాల్సిన భూమి దక్కే వరకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ పరంగా ఆదుకుంటామని, అధికారంలోకి వచ్చిన వెంటనే భూమి హక్కు పత్రాలను అందజేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు.

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం

మృతి చెందిన చేనేత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా టీడీపీ తరఫున అందిస్తామని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మీప్రసన్నకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు తెలిపారు. ఓ కుటుంబం ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం ఇంత వరకు పరామర్శించకపోవడం, ఆర్థిక సాయం ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు వీరయ్య మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మోహన్‌రెడ్డి, నామాల వెంకటయ్య, కిరణ్‌స్వామి, ఓబినేని సుబ్బమ్మ, పుత్త రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

● కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్

ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం మృతుల కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. తానూ చేనేత సామాజిక వర్గంలో జన్మించానని, చేనేత కుటుంబం ఆపదలో ఉందని, వారిని ఆదుకోవడానికి కర్నూలు నుంచి వచ్చానని తెలిపారు. కుటుంబం ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారును సస్పెండ్ చేయాలని, లక్ష్మీప్రసన్న చదువుకు ప్రభు త్వం ఆర్థిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం బీసీల కడుపు కొట్టి మా రక్తంతో అన్నం తినడం ఏమాత్రం భావ్యమని ఆ యన ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాయంపై పోరాడేందుకు బీసీలంతా నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మావిళ్ల శ్రీహరి, అడ్వకేట్ రామదాసు, ఆలూరు వెం కటసుబ్బయ్య, నామాల వెంకటయ్య, గజ్జల నరసింహారెడ్డి, పుత్తా రామచంద్రయ్య, ఉన్నం కిరణ్‌స్వా మి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



చేనేత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కర్నూలు ఎంపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు

వైభవంగా పుష్పయాగం



స్వామి వారికి పుష్పయాగం చేస్తున్న వేద పండితులు

గుర్రంకొండ, మార్చి 25: మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం వేద పండితులు పుష్పయాగాన్ని కన్నులపండువగా చేశారు. ఉదయాన్నే స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం టీటీడీ నుంచి వచ్చిన వివిధ రకాల పూలతో స్వామి వారికి వేద పండితులు పుష్పయాగాన్ని ఘనంగా చేశారు. పుష్పయాగంతో పది రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పుష్పయాగాన్ని తిలకించడానికి భక్తులు అధికంగా వచ్చారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజ్, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వరద, నరసింహులు, వెంకీ ఆలయాధికారి కృష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లలు దాటి వస్తున్న కర్ణాటక మద్యం





బస్టాండు వద్ద తాగి పడేసిన మద్యం ప్యాకెట్లు, ఇటీవల పోలీసులు సీజ్ చేసిన మద్యం (ఫైల్)

వాల్మీకిపురం, మార్చి 25: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ఎక్కడ చూసినా కర్ణాటక మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా జరుగుతోంది. కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్లను చెక్‌పోస్టులు, పోలీసు అధికారుల కళ్లు కప్పి ఇక్కడికి తెచ్చి వ్యాపారం జోరుగా చేస్తున్నారు. కర్ణాటకలో రూ.40 రూపాయలకు దొరికే టెట్రా ప్యాకెట్ ఇక్కడ రూ.100 నుంచి రూ.150 వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, జూనియర్ కళాశాల, నిర్మానుష్య ప్రాంతాల్లో తాగిపడేసిన కర్ణాటక మద్యం ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి వాల్మీకిపురం నలుదిక్కులా జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీలు సైతం ముమ్మరం చేశారు. ముఖ్యంగా కర్ణాటక ఆర్టీసీ బస్సులను, ప్రైవేట్ వాహనాలను ఎప్పటికప్పుడు పోలీసులు తనిఖీ చేస్తున్న కర్ణాటక మద్యం మాత్రం వస్తూనే ఉంది.

కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం

-షేక్ షావలి, ఎస్ఈబీ, ఎస్ఐ, వాల్మీకిపురం.

కర్ణాటక మద్యం అక్రమ రవాణా, విక్రయాలు కొనసాగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోము. అలాగే మండలంలో బెల్టు దుకాణాలు, నాటుసారా తయారీ విక్రయాలకు పాల్పడితే చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ప్రజలు కూడా కర్ణాటక మద్యం నాటుసారా, బెల్టు దుకాణాలపై సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటాం.

అక్రమ మద్యంతో జైలు పాలు

-నాగేశ్వరరావ్, ఎస్ఐ, వాల్మీకిపురం.

అక్రమ మద్యం రవాణా చేసినా, విక్రయించినా చట్టరీత్యా కేసులు నమోదైతే ఎంతటి వారైనా జైలు పాలు కావడం తప్పదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తాం. తనిఖీల్లో పట్టుబడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

జనం కోసమా.. ఓట్ల కోసమా?

- ● అమలులో ఎన్నికల కోడ్
- ● అయినా.. నేడు జడ్పీ సర్వ సభ్య సమావేశం
- ● జడ్పీ చైర్మనే వైసీపీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి
- ● వైసీపీ ఎమ్మెల్యేలు.. ఎంపీలూ అభ్యర్థులే

కడప (రూరల్), మార్చి 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ మేరకు ఆయా పాలక మండళ్లు ప్రజలను ప్రభావితం చేసే ఎలాంటి నిర్ణయాలను తీసుకోకూడదు. ఈ నేపథ్యంలో మంగళవారం జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని జడ్పీ పాలక మండలి నిర్వహిస్తోంది. పాలకమండలి సభ్యులంతా వైసీపీకి చెందినవారే ఉన్నారు. జడ్పీ చైర్మన్‌గా ఉంటున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు ఆయన ఎన్నికల ప్రచారాన్ని కూడా మొదలుపెట్టారు.

అయితే ఆయన జడ్పీ చైర్మన్ హోదాలో నేటి జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు సమావేశానికి హాజరుకావాలని జడ్పీ సీఈవో పేరున మైనార్టీ సంక్షేమశాఖ మంత్రికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి, ఎంపీలకు, ఎమ్మెల్యేలకు ఆహ్వానం పంపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలందరూ ఇప్పటికే వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. వీరి అధ్వర్యంలో నేడు జడ్పీ సర్వసభ్యసమావేశాన్ని నిర్వహిస్తున్నది జనం కోసమా లేక ఎన్నికలలో ఓట్లకోసమా.. అన్న సందేహాలను కొందరు అధికారులు వెలిబుచ్చుతున్నారు.

ఇప్పటి దాకా మొక్కుబడిగానే..

2021 డిసెంబర్ 12న మొదటి జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అప్పటి నుంచి సమావేశాలు కొనసాగుతున్నా ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏనాడూ అర్థవంతమైన సమావేశాన్ని నిర్వహించలేదు. మొక్కుబడిగా కొనసాగిస్తు వచ్చారు. సమావేశాల పేరిట లక్షల రూపాయల ప్రజాధాన్ని ఖర్చుచేయడం తప్ప జిల్లా ప్రజలకు ఒరగబెట్టింది ఏమీలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నఫలంగా ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో వైసీపీ ప్రజాప్రతినిధులు జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించడం వెనుక ఏదో మతలబు ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సీఈవో సెలవులో ఉన్నా..

జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజుల క్రితమే ఆయన హార్ట్‌కు స్టంట్ వేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆయన నెల రోజులు లీవ్ కోరుతూ కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. ఇలాంటి సమయంలో ఆయన సంతకంతో నేడు జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు అందరికీ ఆహ్వానాలను పంపారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేయడానికే సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

ఉక్కిరిబిక్కిరవుతున్న అధికారులు

సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ అమలు కావడంతో జిల్లా అధికారులు ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియలో తలమునకలై ఉన్నారు. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి అనునిత్యం ఎన్నికలకు సంబంధించిన ఏదో ఒక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జడ్పీ సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అధికారులకు ఆహ్వానాలు పంపారు. తరువాత అనివార్య కారణాలవలన ఉదయం 9 గంటలకే సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సందేశాన్ని పంపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆయాశాఖల జిల్లా అధికారులందరు తమ పూర్తిస్థాయి ప్రగతి నివేదికలతో హాజరుకావాలని తెలిపారు. దీంతో ఎన్నిల విధులలో బిజీగా ఉన్న అధికారులు ఉన్నఫలంగా ప్రగతి నివేదికలను తయారు చేయాల్సి రావడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

జగన్ బస్సు యాత్ర ఏర్పాట్లపై ఎస్పీ పరిశీలన



ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో బస్సు యాత్ర వెళ్లే దారిని పరిశీలిస్తున్న ఎస్పీ

ఎర్రగుంట్ల, మార్చి 25: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇడుపులపాయ నుంచి చేస్తున్న బస్సు యాత్రపై ఎర్రగుంట్లలోని పోలీసులకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పలు సూచనలు చేశారు. సోమవారం సాయంత్రం ఆయన ఇంటలిజెన్స్, ఇతర అనుబంధ పోలీసు శాఖాధికారులతో కలసి ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో పర్యటించారు. నాలుగు రోడ్ల చుట్టూ ఉన్న ట్రాఫిక్, ఇతర ఏర్పాట్లపై సూచనలు చేశారు. సామాన్యులకు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కిందిస్థాయి అధికారులకు సూచనలిచ్చారు. అర్బన్ సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

● ఏప్రిల్ 16 నుంచి బ్రహ్మోత్సవాలు ● 22 కల్యాణోత్సవం ● కలెక్టర్ విజయరామరాజు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు, చిత్రంలో ఎస్పీ సిద్ధార్థ కౌశల్, తదితర అధికారులు

ఒంటిమిట్ట, మార్చి 25: కోదండరాముని కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. సోమవారం స్థానిక పరిపాలన భవనం సమావేశపు హాలులో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, జేసీ గణేశ్‌కుమార్, కడప నగర కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌లతో కలిసి కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలపై కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 16 నుంచి 26వ తేదీ వరకు కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయన్నారు. అందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల సమయంలో ఎక్కడా కూడా మోడల్ కోడ్ ఉల్లంఘన జరగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 22వ తేదీ జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ తదితర ప్రముఖులు వచ్చే అవకాశం ఉన్నందున భారీ భక్తజనం సందోహం రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక, కనీస వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. 22వ తేదీ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల సమయంలో కల్యాణోత్సవం చేస్తున్నందున విద్యుత్ దీపాలంకరణలతో పాటు అత్యంత పటిష్ట భద్రతా చర్యలను కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ఎక్కడా కూడా రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు, కటౌట్‌లు కనిపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మాట్లాడుతూ టీటీడీ అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టి కృషి చేసి కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించకుండా విధులు నిర్వహించడంతో పాటు కోడ్ ఉల్లంఘన ఎక్కడ జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడా, ఎలాంటి చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారులు సంపూర్ణ సహకారాలనందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో గంగాధర్ గౌడ్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, సీపీఎస్‌వో నరసింహకిషోర్, ఎస్‌వీబీసీ సీఈవో షణ్ముఖకుమార్, సీఈ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈవోలు నటేష్‌బాబు, కడప డీఎస్పీ షరీఫ్, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రారెడ్డి, ఉద్యాన శాఖ డీడీ రాజీవ్‌మైఖెల్, సమగ్ర శిక్ష ఏపీసీ ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, డీఆర్‌డీఏ మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, సురేష్‌రెడ్డి, డీపీవో ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు రమణ, వీరన్న, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముని బ్రహ్మోత్సవ వివరాలు

ఏప్రిల్ 16న సాయంత్రం అంకురార్పణ, 17న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనసేవ, 18న వేణుగానాలంకారం, సాయంత్రం హంస వాహనం, 19న ఉదయం వటపత్రశాయి అలంకారం, సాయంత్రం సింహ వాహన సేవ, 20న నవనీత కృష్ణాలంకారం, సాయంత్రం హనుమత్ సేవ, 21న మోహినీ అలంకారం, సాయంత్రం గరుడ సేవ, 22న శివధనుర్భాలంకారం, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు కల్యాణోత్సవం, అనంతరం గజవాహనం, 23న ఉదయం రథోత్సవం, 24న కాళీయమర్ధనాలంకారం, సాయంత్రం అశ్వవాహన సేవ, 25న చక్రస్నానం, సాయంత్రం ధ్వజారోహణం, 26న సాయంత్రం పుష్పయాగం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

కారు ఢీకొని ఇరువురు మృతి

● రెండు రోజుల్లో కొడుకు పెళ్లి ● పెళ్లి పత్రికలు పంచి వస్తుండగా ఘటన




రామచంద్రారెడ్డి మృతదేహం

ఒంటిమిట్ట, మార్చి 25: ఒంటిమిట్ట మండలం నడింపల్లెలో విషాదం చోటుచేసుకుంది. మరో రెండురోజుల్లో జరగనున్న కొడుకు పెళ్లికి పత్రికలు పంచి వస్తుండగా కారు ఢీకొనడంతో పెళ్లికొడుకు తండ్రితో పాటు మరొకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నడింపల్లెకు చెందిన ఆదిన రామచంద్రారెడ్డి(60) కొడుకుకు ఈనెల 28న వివాహం జరగనుంది. ఈ మేరకు తన కొడుకు పెళ్లి పత్రికలు బంధువులు, స్నేహితులకు పంచేందుకు సోమవారం లగువ గోపాల్‌రెడ్డి (65)తో కలసి ఆయన ద్విచక్రవాహనంలో ఒంటిమిట్ట వెళ్లారు. అక్కడ పెళ్లి పత్రికలు పంచి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. రాజంపేట వైపు వెళుతున్న కారు వీరి వాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనం నడుపుతున్న రామచంద్రారెడ్డి, వెనుక కూర్చున్న గోపాల్‌రెడ్డి ఎగిరి సమీపంలో ఉన్న కట్టువలో పడిపోయారు. వెంటనే డ్రైవర్ కారును ఆపి వారిద్దరినీ ప్రాథమిక చికిత్స నిమిత్తం ఒంటిమిట్ట గవర్నమెంటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్ గోపాల్‌రెడ్డి అప్పటికే ఇద్దరూ మృతిచెందారని నిర్ధారించారు. వీరి మృతదేహాలను కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ మధుసూధన్‌రావు తెలిపారు. పెళ్లి కొడుకు తండ్రి మృతితో పెళ్లింట విషాదం నెలకొంది.



మృతులు రామచంద్రారెడ్డి, గోపాల్ రెడ్డి (ఫైల్‌ఫొటో)



చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుర్రంకొండ మౌలాలి (ఫైల్)

రామాపురం, మార్చి 25: మండలంలోని బండపల్లి పంచాయతీ ఐరిస్ హోటల్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఈనెల 17న ఒంటిపై పెట్రోల్ పోసుకొని కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం మండలానికి చెందిన గుర్రంకొండ మౌలాలి (32)కి గత పది సంవత్సరాల క్రితం చిన్నమండెం మండలం టౌన్‌కు చెందిన వహీదాతో వివాహం జరిగింది. ఇరువురికి ఇంతవరకు పిల్లలు కలగలేదు. భార్యాభర్తలు ఇరువురు కలిసి ముస్లిం సంప్రదాయం ప్రకారంగా 40 రోజుల క్రితం విడాకులు తీసుకున్నారు. కాగా తన అత్తగారితో నా భర్త.. కొత్త ఇళ్లు కొనివ్వు.. నేను నా భార్యను కాపురానికి పిలుచుకుంటా అని ఫోన్ చేసి చెప్పేవాడని, అయితే తమ అత్త గారు తన వద్ద అంత డబ్బు లేదని కుమారుడితో ఫోన్‌లో చెప్పినట్లు పోలీసులు తెలిపారు. తల్లి ఇల్లు కొనివ్వమంటే తన వద్ద స్తోమత లేదని చెప్పడం, భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 17న ఐరిస్ హోటల్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే పొత్తుకూరుపల్లెకు చెందిన బసిరెడ్డి మరికొందరు కలిసి మంటలను ఆర్పి తీవ్ర గాయాలతో ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ ఎల్‌వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తేనెటీగల దాడిలో ఉపాధి కూలీ మృతి

కమలాపురం రూరల్, మార్చి 25 : కమలాపురం మండలం జంబాపురం పంచాయతీకి చెందిన గంగిరెడ్డి (60) తేనెటీగల దాడిలో మృతి చెందాడు. సోమవారం ఉదయం ఉపాధి కూలీకి వెళ్లిన గంగిరెడ్డి కాల్వ పని చేస్తుండగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో ఆయన స్పృహ కోల్పోయి పడిపోయాడు. తోటి కూలీలు ఆయనను 108 ద్వారా కమలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన ఆయన కుటుంబానికి ఉపాధిహామీ తరపున రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ఏపీవో పార్థసారథి తెలిపారు.

వ్యక్తిపై కొడవలితో దాడి


చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణ

లింగాల, మార్చి 25: పాత కక్షలు మనసులో ఉంచుకుని కత్తితో దాడి చేయడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పులివెందుల రూరల్ సీఐ బాలమద్దిలేటి తెలిపిన వివరాల మేరకు... తమ కుటుంబ సభ్యులతో వెన్నపూస నారాయణరెడ్డి అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఐదు నెలల క్రితం తాతిరెడ్డిపల్లెకు చెందిన ఆకుల లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కక్ష పెంచుకున్న నారాయణరెడ్డి ఆదివారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో లక్ష్మీనారాయణపై కొడవలితో దాడి చేశాడు. దీంతో తల, ముఖంపై గాయాలైన లక్ష్మీనారాయణను పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురం తరలించినట్లు తెలిపారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి నారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతి చెందిన సురేశ్

ఖాజీపేట, మార్చి 25: నెల్లూరు జిల్లా మర్రిపాడు సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న సురేశ్ (25)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఖాజీపేట మండలం ఆంజనేయకొట్టాలు పంచాయతీలోని పుల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన సురేశ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. అయితే సోమవారం పనినిమిత్తం వెళుతుండడంతో మర్రిపాడు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం భార్య సునీత, బంధువులకు తెలుపడంతో ఆ కాలనీ శోకసముద్రంలో మునిగింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఘర్షణ కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

మైలవరం, మార్చి 25: మండల పరిధిలోని వేపరాల గ్రామంలో 2015వ సంవత్సరంలో మద్దూరి పెద్ద శంకరయ్యను కట్టెలతో కొట్టి ఘర్షణకు పాల్పడిన ఘటనలో జడ్జి సోమవారం ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధించినట్లు మైలవరం ఎస్ఐ రెడ్డి సురేశ్ తెలిపారు. తూలబండి సుబ్బరాయుడు, తూలబండి లక్ష్మీదేవి, తూలబండి చెన్నకేశవులకు జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి ఏడాదిపాటు జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ సోమవారం తెలిపారు. 2015లో నమోదైన కేసును విచారించిన అనంతరం నిందితులను దోషులుగా నిర్ధారించి శిక్ష విధించినట్లు తెలిపారు.

కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

జమ్మలమడుగు, మార్చి 25: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామం సొసైటీ కాలనీ వద్ద ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు టపాసులు పేల్చారని సమాచారం తెలుసుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చి తనిఖీ చేసినట్లు పోలీసులు తెలిపారు. టపాసులు పేల్చిన వారిని విచారించి జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు, సీఐ కరుణాకర్‌కు తెలియజేశారు. దీంతో ఒకరిపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీలో రూ.లక్ష స్వాధీనం



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నందలూరు, మార్చి 25: కడప-చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద రాజంపేట డీఎస్పీ వి.ఎన్.కె.చైతన్య ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలో ఎటువంటి ఆధారాలు లేని కారులోని రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. కడప నుంచి చెన్నైకి వెళుతున్న ఈ కారులో నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి నగదును ఎన్నికల అధికారికి అప్పజెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐలు మద్దయ్య ఆచారి, మంజునాథరెడ్డి, ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దుకాణం నుంచి బెల్ట్‌షాపులకు మద్యం

పట్టుకున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ప్రొద్దుటూరు, మార్చి 25 : ప్రొద్దుటూరులో ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి బెల్టు షాపులకు మద్యం సరఫరా చేయడంపై కడప స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో బొమ్మల మణి అనే వ్యక్తిని అరెస్టు పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్దనుంచి 96 ఏపీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బొమ్మల మణిని విచారించగా ఆ మద్యం బాటిళ్లు గాంధీరోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి సేల్స్‌మెన్లు రాజేష్, సుబ్బారెడ్డి సరఫరా చేసినట్లు అంగీకరించారు. దీంతో వారిని అరెస్టు చేశారు. వీరిని కోర్టుకు హాజరుపరుచగా రిమాండుకు తరలించారు.ఈ దాడులలో ఎస్ఐ కిశోర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నట్లు సీఐ మహేష్ కుమార్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. నలుగురికి గాయాలు

వేంపల్లె, మార్చి 25: ఇరువర్గాల ఘర్షణలో నలుగురు కత్తిపోట్లకు గురయ్యారు. వేంపల్లె సీఐ చాంద్‌బాషా కథనం మేరకు ఆదివారం రాత్రి పట్టణంలోని గండి రోడ్డులో నరసింహులు, శివ, శ్రీనివాసులును నాగేంద్ర అనే వ్యక్తి దూషించడంతో పాటు కత్తితో దాడి చేశాడు. దీంతో వారు నాగేంద్రను వెంబడించి దాడి చేశారు. ఈ దాడిలో నలుగురికీ గాయాలు కాగా వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

ముద్దనూరు మార్చి 25: స్థానిక రైల్వేస్టేషన్ ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం ఆదివారం చోరీకి గురైనట్లు సీఐ దస్తగిరి తెలిపారు. జమ్మలమడుగు టౌన్ నాగుకట్టకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి రైల్వే ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 22 వ తేదీన డ్యూటీ నిమిత్తం రైల్వే స్టేషన్ ముందు ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి వెళ్లాడు. తిరిగి ఆదివారం రాత్రి వచ్చి చూడగా ద్విచక్రవాహనం కల్పించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


కులరహిత దేవుడు..

- కులరహిత సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన త్యాగధనుడు నగిరిపాడు రంగనాయకుడు
- 28 నుంచి రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- దళితుల తొలిపూజే రంగనాయకస్వామి ఆలయ ప్రత్యేకత

నగిరిపాడు రంగనాథుడు


రంగ నాయక స్వామి ఆలయ ప్రాంగణం


రంగనాయక స్వామి మూలవిరాట్


ఆలయంలో ఉన్న అలనాటి పాదుకలు


శిథిలావస్థలో ఉన్న బ్రహ్మంగారి కాలజ్ఞానం

రాజంపేట, మార్చి 25: తెలుగు రాష్ట్రాలలోనే చిట్వేలి రంగనాయకస్వామి ఆలయానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ ఆలయంలో దళితుల తొలిపూజ ప్రత్యేకత. కులరహిత సమాజం కోసం నగిరిపాడు రంగనాయకస్వామి తన జీవితాన్ని త్యాగం చేసి జీవసమాధి అవ్వడం ఇక్కడి ప్రత్యేకత. బ్రహ్మంగారి వరపుత్రుడిగా పేరుగాంచిన నగిరిపాడు రంగనాయకస్వామి ఆలయంలో బ్రహ్మంగారు స్వయంగా రచించిన తాళపత్ర గ్రంథాలు ఉన్నాయి. రంగనాయకుడు జీవ సమాధి అయినప్పుడు ఆనాటి అగ్నిగుండంలో బయల్పడిన స్వామి వారి పాదుకలు, యోగదండం నేటికీ పూజలందుకుంటున్నాయి. ఈనెల 28 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు 11 రోజులు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి.

17వ శతాబ్దంలో కులరహిత సమాజం కోసం బ్రహ్మంగారి వరపుత్రునిగా జన్మించిన నగరిపాడు రంగనాయక స్వామి కుల రహిత సమాజం కోసం తన జీవితమే త్యాగం చేశాడు. తన జీవ సమాధికి కావాల్సిన స్థలాన్ని తన ప్రియశిష్యుడు కేసారపు మారయ్య ఇచ్చినందుకు ప్రతి ఏడాది ఆరంభంలో విజయదశమి రోజున వారికి తొలిపూజ జరగాలని నాడు స్వామి ఆదేశించడం అది నేటికీ కొనసాగుతోంది. ఆలయ ముఖద్వారం ఎదుటే స్వామికి భూమి ఇచ్చిన దళిత కుటుంబానికి చెందిన కేసారపు మారయ్యకు చెందిన ఆలయం నిర్మించి ఉండటం ఈ ఆలయం విశిష్టత. తిరుమల కొండల నుంచి ప్రవహించే గుంజన నదీ తీరాన పచ్చని పంట పొలాల మధ్య చిట్వేలి-రైల్వేకోడూరు రహదారి పక్కన కొలువుదీరిన రంగనాయకస్వామి ఆలయం రాష్ట్రంలోనే ఓ విశిష్ట ఆలయంగా పేరుగాంచింది.

నగరిపాడును పరిపాలించిన జగ్గరాజు కుమారుడు రంగరాజు 17-04-1692 తేదీ జన్మించాడు. ఈయన 16వ ఏటలోనే దేశ సంచారం చేశారు. జగ్గరాజు, జగ్గమ్మ దంపతులు బ్రహ్మంగారిని పూజించగా ఆయన వరం వల్ల రంగరాజు జన్మించాడని ఈ ప్రాంతీయుల విశ్వాసం. రంగరాజు జన్మించిన ఒక సంవత్సరానికి 1693లో బ్రహ్మంగారు జీవ సమాధి కావడం గమనార్హం. రంగరాజు అలనాడే రాజరిక కుటుంబ విధానాలను వ్యతిరేకించి కులమతాలకు వ్యతిరేకంగా పోరాడారు. రాచరికం వద్దు రాజభోగాలు అసలే వద్దు అని ఆనాడే ఆయన సంచార జీవితాన్ని అలవాటు చేసుకున్నారు. రాష్ట్రంలో అనేక గ్రంథాల్లోనూ, బ్రహ్మంగారు రాసిన కాలజ్ఞానంలోనూ రంగరాజు బ్రహ్మంగారి మనవరాలు ఈశ్వరమ్మను పెళ్లి చేసుకోవాలని రాసి ఉంది. అయితే ఆనాడు రాజ కుటుంబానికి చెందిన రంగరాజుకు ఈశ్వరమ్మను పెళ్లి చేసే అంశంలో ఇరువర్గాలు ససేమిరా ఒప్పుకోలేదు. విశ్వ బ్రాహ్మణ కులానికి చెందిన బ్రహ్మంగారి మనవరాలిని రంగరాజుకు ఇచ్చి పెళ్లి చేసే అంశంలో చివరకు ఈశ్వరమ్మ తల్లిదండ్రులైన బ్రహ్మంగారి కుమారులు కూడా ఒప్పుకోలేదు. ఇక రంగరాజు చేసేది లేక తన సంచారంలో బనగానపల్లెకు వెళ్లి గరిగిరెడ్డి అచ్చమ్మ ఇంటి ముందు చింత చెట్టు కింద బ్రహ్మంగారు దాచి ఉంచిన కాలజ్ఞాన పత్రాలను తెరిచి అందులో కొన్నింటిని తీసుకుని అందులో అంశాలు చదువగా ఈ యుగంలో ఈశ్వరమ్మతో పెళ్లి జరగడం కష్టమని కులమతాలు అంతరించిన నాడే ఈశ్వరమ్మతో రంగరాజు వివాహం జరుగుతుందని అందులో ఉండగా చదివి పెళ్లి చేసుకోవడాన్ని రంగరాజు విరమించుకున్నారు. రంగరాజు తీసుకువచ్చిన బ్రహ్మంగారి కాలజ్ఞాన తాళపత్ర గ్రంథాలు నేటికీ నగరిపాడు రంగరాజుస్వామి ఆలయంలో ఉన్నాయి. రంగరాజు చేసేది లేక నగరిపాడు తిరిగి వచ్చి కులమతాలకు వ్యతిరేకంగా జీవ సమాధి కావడానికి నిర్ణయించారు. ఆయన కొంతకాలం గుండాలకోనలో తపస్సు చేసి 21-02-1717 సంవత్సరంలో నగరిపాడులో అగ్ని సమాధి అయ్యారు. ఆయన దళిత కుటుంబానికి చెందిన కేసారపు మారయ్యకు చెందిన స్థలంలో సమాధి అయ్యారు. అప్పటి నుంచి రంగరాజు స్వామి ఆలయంలో మొదటిగా అరుంధతీయులు పూజలు చేసిన తరువాతే మిగతా వారు పూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అలాంటి సంప్రదాయం కలిగిన ఆలయం నగరిపాడులో ఉండటం విశేషం. రంగరాజు వివాహం చేసుకోదల్చిన బ్రహ్మంగారి మనువరాలు ఈశ్వరమ్మ కూడా పెళ్లి చేసుకోకుండా జీవ సమాధి కావడం విశేషం. రంగరాజు ఆలయం సమీపంలోనే కంసాలపల్లె వద్ద సద్గురు రంగస్వామి ఆధ్వర్యంలో ఈశ్వరమ్మ ఆలయం ఉంది. పచ్చని పంట పొలాల నడుమ గుంజన నదీ తీరాన నగరిపాడు గ్రామ సమీపంలో రంగరాజస్వామి, ఈశ్వరమ్మ ఆలయం నేడు భక్తుల పూజలతో నిత్య కల్యాణం పచ్చ తోరణం అన్న చందంగా అలరారుతున్నాయి. ఈ సందర్భంగా రంగనాయక స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పోలిన నాగేశ్వర ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈనెల 28 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఏప్రిల్ 1వ తేదీ రంగనాయక స్వామి అగ్నిసమాధి అయిన సందర్భంగా అదేరోజు రాత్రి 7 గంటలకు బ్రహ్మంగారు రచించిన తాళపత్ర గ్రంథాలు, స్వామి వారి అగ్నిగుండంలో బయటపడ్డ పాదుకలు, యోగదండం, రుద్రాక్షమాల, అడ్డఖడ్గం, బేరికోమటి తక్కెడ పల్లలు ప్రదర్శింపబడతాయన్నారు. ఈనెల 28 నుంచి 11 రోజుల పాటు ఉదయం, రాత్రి అన్నదానాలు, ప్రత్యేక హరికథలు, బుర్రకథలు, ఇతర భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాలకు కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాల ప్రజలు పాల్గొంటారన్నారు.


పోలిన నాగేశ్వర, ఆలయ కమిటీ చైర్మన్

వైభవంగా లక్ష్మి నరసింహస్వామి కల్యాణం




మాంగల్యాన్ని భక్తులకు చూపుతున్న వేద పండితులు, ప్రత్యేక అలంకరణలో లక్ష్మి నరసింహస్వామి

వల్లూరు, మార్చి 25 : మాచిరెడ్డిపల్లె లక్ష్మీ నరసింహస్వామి బహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీ నరసింహ చెంచు లక్ష్మీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే లక్ష్మీ నరసింహ మూలమంత్ర గాయత్రి, శతాక్షర, సర్వరక్షాకర నరసింహ, మహావాచస్పత హోమాలు, మహా పూర్ణాహుతి, కలశోద్వాసన, ధ్వజావరోహణ చేశారు. కలశాల్లో ఉన్న అభిషేక జలంతో భక్తులకు సంప్రోక్షణ చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు మేళతాళాల నడుమ కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ అనంతరం పుత్తా నరసింహారెడ్డి, సోదరుడు రామచంద్రారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కన్యాదానం చేశారు.

అనంతరం వివిధ పోటీలతో పాటు మధ్యాహ్నం 3 గంటలకు పాలపండ్ల ఎద్దులు, సేద్యపు ఎద్దులకు పోటీలను ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30కు భక్తులకు అన్నదాన వితరణ చేశారు. కమలాపురం నియోజకవర్గం నుంచే కాక చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రజలు పెద్దఎత్తున కల్యాణానికి తరలివచ్చారు. పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో గోల్‌మాల్

- *రూ.10 లక్షలకు పైగా స్వాహా*
- *విధుల నుంచి నలుగురు తొలగింపు*
- *డబ్బులు చెల్లించని ఇద్దరిపై కేసు*

కడప (క్రైం), మార్చి 25 : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న నలుగురు ఉద్యోగులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. నెల రోజుల వ్యవధిలో రెండు దుకాణాల్లో రూ.10.7 లక్షలకు పైగానే స్వాహా చేశారు. వీరి ప్రవర్తనపై అనుమానం వచ్చిన ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక టీమ్‌లతో తనిఖీ చేసి దుర్వినియోగమైన మొత్తాన్ని రికవరీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రతి మద్యం దుకాణంలో సూపర్‌వైజరుతో పాటు సేల్స్‌మెన్ ఉంటారు. వారిని ఎక్సైజ్ సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. కడప నగర శివారులోని పులివెందుల రోడ్డులో ఉన్న దుకాణంతో పాటు ఇర్కాన్ సర్కిల్ సమీపంలో ఉన్న మరో మద్యం దుకాణంలో పనిచేస్తున్న సిబ్బంది మద్యం అమ్మిన డబ్బులను స్వాహా చేస్తున్న విషయం గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కడప ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు కృష్ణకుమార్ ఆధ్వర్యంలో విచారణ చేశారు. దాదాపు పులివెందుల రోడ్డులోని మద్యం దుకాణంలో రూ.2.32 లక్షలు, ఇర్కాన్ సర్కిల్ సమీపంలోని మద్యం దుకాణంలో 8.4 లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించారు. నలుగురినీ విచారించిన ఎక్సైజ్ అధికారులు వారి నుంచి డబ్బు రికవరీ చేసినట్లు కడప ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. అయితే ఆలంఖాన్‌పల్లె, ఇర్కాన్ సర్కిల్ సమీపంలోని మద్యం దుకాణానికి సంబంధించి 16 వేలు రికవరీ కాకపోవడంతో ఆ దుకాణం సూపర్‌వైజరు నరసింహులు, సేల్స్‌మన్ వెంకటసుబ్బయ్యపై చెన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆయా సిబ్బందిని విధుల నుంచి తొలగించామన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నందలూరు, మార్చి 25: మండలంలోని కుందా నెల్లూరు గ్రామంలో రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గాదెన శివ నరహరి, గాదెన యల్లయ్యకు చెందిన రెండు గడ్డివాములలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గమనించిన బాధితులు రాజంపేట ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేయగా హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పారు. ఈలోపు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రెండు గడ్డివాములు అగ్నికి ఆహుతి అవ్వడం వల్ల రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వారు కోరారు.

చెట్టుపై నుంచి పడి మహిళకు గాయాలు

కురబలకోట, మార్చి 25: చెట్టుపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ నార్లపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి భార్య లక్ష్మీదేవమ్మ(56) గ్రామ సమీపంలోని తమ పొలంలో ఉన్న చింతచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. కుటుంబీకులు ఆమెను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్సల నిమిత్తం రుయాకు తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

బి.కొత్తకోట, మార్చి 25: నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. బి.కొత్తకోట మండలంలోని గోళ్లపల్లి పంచాయతీ పరిధిలోని నల్లంకివారిపల్లి సమీపంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లగా ఓ చెట్టు కింద అక్రమంగా సారా విక్రయిస్తున్న నల్లంకివారిపల్లికి చెందిన కె.సుబ్బన్న(63)తో పాటు, దిన్నిమీదపల్లెకు చెందిన ఎ.నాగార్జునరెడ్డి(32), టి.ఆనందరెడ్డి(43) లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి 24 లీటర్ల నాటుసారాను స్వాధీనంచేసుకున్నారు. నిందితులను తదుపరి చర్య నిమిత్తం రిమాండుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. మండలంలో సారా విక్రయాలు ఎక్కడ జరుగుతున్నా సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

మైనర్లతో ఎన్నికల ప్రచారం చేయొద్దు

కడప (మారుతీనగర్) మార్చి 25: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రచారానికి 14 ఏళ్లలోపు చిన్నారులను ఉపయోగించరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చినట్లు కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించి చిన్నారులతో ప్రచారం చేయిస్తే సెక్షన్ 3 (1) ప్రకారం శిక్ష తప్పదని తెలిపారు.

వాహనాల తనిఖీల్లో రూ.1.20 లక్షలు స్వాధీనం

కురబలకోట, మార్చి 25: వాహనాల తనిఖీల్లో రూ.1.20 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ సద్గురుడు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్ళులో జాతీయ రహదారిపై వాహనాలను పోలీసులు తనిఖీ నిర్వహించారు. కాగా పోలీసుల తనిఖీల్లో బెంగళూరు నుంచి కడపకు వెళుతున్న ఓ కారులో నగదు పట్టుబడింది. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు

మదనపల్లె టౌన్, మార్చి 25: పొలం వద్ద స్టార్టర్ మరమ్మతులు చేస్తున్న రైతు విద్యుదాఘాతంతో గాయాలపాలయ్యాడు. చౌడేపల్లె మండలం కాటిపేరి గ్రామానికి చెందిన రైతు సుబ్రమణ్యం(65) సోమవారం తన పొలంలో నీరు కడుతుండగా బోరు స్టార్టర్ మరమ్మతు కావడంతో వెళ్లి స్టార్టర్ డోర్ తీశాడు. ఇంతలో పెద్దగా మంటలు రావడంతో పాటు సుబ్రమణ్యం విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

● మున్సిపల్ కమిషనర్ వాసుబాబు



మంచినీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయచోటిటౌన్, మార్చి 25: వేసవిని దృష్టిలో ఉంచుకొని రాయచోటి మున్సిపాలిటీలో మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు తెలిపారు. సోమవారం ఆయన ప్రజలకు నీటి సరఫరాలో భాగంగా వెలిగల్లు వాటర్ స్కీమ్ ఇంటెక్ వెల్‌తో పాటు ఎగువగొట్టివీడు వద్ద గల మంచినీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే వెలిగల్లు ఇంటెక్ వెల్‌లో ఉన్న మోటార్ల పనితీరు గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకుని రిజిష్టర్లు పరిశీలించారు. అంతేగాక ఎగువగొట్టివీడు సమీపంలో గల నీటిశుద్ధి కేంద్రంలో నీటి శుద్ధిపై ఆరాతీశారు. అలాగు నీటిశుద్ధి విషయంలో క్లోరిన్, ఆలమ్ వంటి నీటి శుద్ధి పదార్థాలు సరైన మోతాదులో వాడాలని సిబ్బందికి సూచించారు. వేసవి దృష్ట్యా ప్రజలకు నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా పక్కా ప్రణాళిక చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ప్రజలకు అందించే నీటిశుద్ధి ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన సిబ్బందిని హెచ్చరించారు. ఈయన వెంట మున్సిపల్ ఏఈ కృష్ణారెడ్డి, మున్సిపల్‌రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, వెలిగల్లు వాటర్ స్కీమ్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఆదిబైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ



గాలివీడు, మార్చి 25: మండలంలోని పందికుంట పంచాయతీ దేవరపల్లిలో సోమవారం ఆదిభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. దేవరపల్లిలో ఇటీవల ఆదిభైరవ ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. 23న గణపతిపూజ, దీపారాధన, దీక్షసంగ్రహణ కలశస్థాపన, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, పూర్వక దీక్షహోమం, 24న ప్రాతఃకాల పూజలు, వేద పారాయణం, మంత్రమూల మూర్తులకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష ఆదిభైరవ హోమం, రుద్రహోమం, 25న విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ అలంకారం, జ్వాలా దర్శనం వంటి కార్యక్రమాలను వేద పండితులచే వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున భక్తాదులకు ఆలయ నిర్వాహకులు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పందికుంటతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శివాలయంలో పౌర్ణమి పూజలు



నీలకంఠుడు అలంకారంలో దర్శనమిచ్చిన అగస్త్యేశ్వరస్వామి

రాయచోటిటౌన్, మార్చి 25: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని మాండవ్యనది ఒడ్డున వెలసిన ప్రాచీన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాఘపౌర్ణమి (కదిరి పౌర్ణమి) సందర్భంగా పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు అగస్త్యేశ్వరస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి నీలకంఠుడి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పౌర్ణమిని పురష్కరించుకొని రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన రజక నేతలు



రాంప్రసాద్‌రెడ్డితో రజక సంఘం నేతలు

రాయచోటి టౌన్, మార్చి 25: రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో సోమవారం కడప, అన్నమయ్య జిల్లాల రజక సంఘం నేతలు రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడప జిల్లా రజక సంఘం అధ్యక్షుడు రవి, అన్నమయ్య జిల్లా రజక సంఘం అధ్యక్షుడు టి.రమేశ్‌బాబు, ఉపాధ్యక్షుడు రమణ, కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు నటశేఖర, బాలరాజు, రెడ్డయ్య, చంద్ర, సహదేవ, కుమార్, అంజనేయులు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, సుబ్రమణ్యం, సురేంద్రం, శివకుమార్ తదితరులు రాంప్రసాద్‌రెడ్డిని కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి పలు విషయాలపై చర్చించారు.

కూటమిదే విజయం: బీజేపీ

రాయచోటిటౌన్, మార్చి 25: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, ఎన్డీఏ కూటమిదే విజయమని రాష్ట్ర అభివృద్ధి ఎన్డీఏతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాసకుమార్‌రాజు అన్నారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన, ఎన్డీఏ కూటమిలో భాగంగా రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని జిల్లా వాసులు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఏపీ ముఖ్యమంత్రిగా సేవలందించిన వ్యక్తిని ఎంపీగా గెలిపిస్తే జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో రాబోవు రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ జెండాలు వేరైనా ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, భావితరాల భవిష్యత్ వారి లక్ష్యం అని గుర్తు చేశారు. పేదరికం లేని దేశాన్ని నిర్మించాలనే నినాదంతో పనిచేస్తున్న ఎన్డీఏ మన రాష్ట్రానికి చాలా అవసరమని జిల్లా వాసులకు శ్రీనివాస్‌కుమార్‌రాజు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా నీలకంఠ్రావుపేట దర్గా ఉరుసు



ఉరుసులో భారీగా పాల్గొన్న ప్రజలు

రామాపురం, మార్చి 25: మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ సమీపంలోని శ్రీసాయి నగర్‌లో వెలసిన సమర్థ సద్గురు దర్గా స్వామిజీ ఆశ్రమంలో సద్గురు హజరత్ దర్బార్ అలీషావలి, రహంతుల్లా అలైబాబా శ్రీజలీల్ మస్తాన్‌అలీ బాబా గార్ల ఉరుసు ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ ఉరుసుకు చుట్టుపక్కల గ్రామాల వారు మొక్కుబడి ఉన్న వారు జెండాలతో పక్కీరుల విన్యాసాలతో దర్గా వద్దకు చేరుకుంటారు. మండలంలోని ప్రజలే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా రాత్రి 10 గంటలకు గొప్ప ఖవ్వాలి పోటీ జరిగింది. ఈ పోటీలో నాగపూర్‌కు చెందిన నసీంజానీ, కర్ణాటకకు చెందిన సిమ్ ర్యాతాజ్‌ల మధ్య గొప్ప ఖవ్వాలి పోటీలు నిర్వహించారు. ఈ ఉరుసు హిందూ, ముస్లింలు దర్గాస్వామి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉరుసు ఘనంగా జరిగింది. ఉరుసుకు వచ్చిన వారికి స్వామివారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉరుసు జిల్లా నుంచి కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉరుసుకు వచ్చిన భక్తులందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లక్కిరెడ్డిపల్లె సీఐ గంగాధర్‌బాబు, రామాపురం ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా

● జనసేన అభ్యర్థి భాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అభ్యర్థి భాస్కర్‌రావు

రైల్వేకోడూరు, మార్చి 25: ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన అభ్యర్థి యనమల భాస్కర్‌రావు తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు తులసిరాం కళ్యాణ మండపంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ బానిస సంకెళ్ల నుంచి భయట పడాలంటే ప్రభుత్వం మారాలని కోరారు. తనను వైసీపీ కోవర్టు అని కొందరు మీడియా మాధ్యమాల్లో ప్రచారం చేయించారని, సిగ్గుమాలిన కొందరు రాజకీయ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. తాను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో సీఈవోగా గత కొన్నేళ్లుగా ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్నానని, పెనగలూరు మండలం నరసింగరాజపురం దళితవాడ గ్రామానికి చెందిన వాడినని తెలిపారు. పవన్‌కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాలకు చెందిన బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలను కలుపుకుని పోతామని తెలిపారు. ఈ ఎన్నికల్లో తాను గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. యువతీ, యువకులకు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ ఎన్నికలను ప్రజలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. అందరికీ అందుబాటులో ఉంటామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతిపక్షాలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఇలాంటి రాజకీయాలు పోవాలంటే ప్రభుత్వాలు మారాలని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు ముద్దపోలు సభాపతి, ముద్దపోలు రామసుబ్బయ్య, గంధంశెట్టి దినకర్‌బాబు, మద్దెల వెంకటసుబ్బయ్య, ఉత్తరాది శివకుమార్, మర్రి రెడ్డయ్య, పూల రఘు, వీర మహిళ శివమ్మ, టీడీపీ నాయకులు కొమ్మా శివ, తేనేపల్లి చిన్నా, పోకల మణి, పుల్లెల రమేష్‌బాబు, కాపు నాయకుడు సుంకర రవి తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

● ఇఫ్తార్ విందులో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లిం మైనార్టీలు

రాయచోటిటౌన్, మార్చి 25: ముస్లిం మైనార్టీలు నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు పాటించే పవిత్ర రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీక అని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రంజాన్ పురష్కరించుకొని సోమవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలోని బాలాజీ టెంపుల్ వీధిలో బేపారి జాఫర్‌అలీఖాన్ ముస్లిం మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని రంజాన్ ఉపవాస శుభాకాంక్షలు తెలియజేసి మైనార్టీ సోదరులందరికీ భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి కుమారుడు రాహుల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, మైనార్టీ సీనియర్ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మల్లూరమ్మ తిరుణాల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ మూలవిరాట్

చిన్నమండెం, మార్చి 25: మండలంలోని కొత్తపల్లి మల్లూరు గ్రామ పంచాయతీలో మాండవ్యనది ఒడ్డున వెలసిన మల్లూరమ్మ తిరుణాల మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని అలంకరించారు. సోమవారం నిండు తిరుణాల, మంగళవారం మైల తిరుణాల, చెక్కభజనలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేషధారణలు, డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు. వచ్చే భక్తుల కోసం మానవతా స్వచ్ఛంద సంస్థ వారు తిరుణాలలో భక్తుల కోసం మజ్జిగ, మంచినీటి సదుపాయం కల్పించారు. తిరుణాలకు ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 100 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. తిరుణాలకు వచ్చే భక్తుల కోసం పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామని, దాదాపు 20 చాందినీ బండ్లు జాతరకు కడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

28న విగ్రహ ప్రతిష్ఠ: మండలంలోని దేవగుడిపల్లె గ్రామం కుర్వపల్లెలో కోదండరామస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని 28న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 26 నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు రాయచోటిలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబును ఆహ్వానించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రతిష్ఠ మహోత్సవంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా హోలీ వేడుకలు



రాజంపేటలో ఆనందోత్సాహాల మధ్య హోలీ వేడుకల్లో యువత

రాజంపేటటౌన్, మార్చి 25: రాజంపేట పట్టణంలో సోమవారం ఘనంగా హోలీ వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని యువత వీధుల్లోకి వచ్చిన రంగులు చల్లుకుంటూ, రంగునీళ్లు చల్లుకుంటూ ఈలలు, కేకలు, కేరింతల మధ్య పెద్దఎత్తున హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఈ వేడుకల్లో పాల్గొని ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

రైల్వేకోడూరు: పట్టణంలో హోలి పండుగను మార్వాడీలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో ఉన్న రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు చెందిన మార్వాడీలు రంగులు చల్లుకుని ఆలింగనం చేసుకున్నారు. ప్రతి మర్వాడీ ఇంటిలో ప్రత్యేక పూజలు చేశారు. కొత్త దుస్తులు ధరించి హోలి సంబరాలు జరుపుకున్నారు.

నందలూరు: నందలూరు రైల్వే కేంద్రంలో రైల్వే కార్మికులు సోమవారం ఉదయం ఘనంగా హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. ఒకరినొకరు రంగులు పూసుకుంటూ, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పండగ చేసుకున్నారు. ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ కార్మికులు ఈ వేడుకలు నిర్వహించుకున్నారు. మహిళలు ఉదయాన్నే లేచి వివిధ రకాల పిండి వంటలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి పండుగ చేసుకున్నారు. పిల్లలు సైతం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ నిర్వహించుకున్నారు.



నందలూరులో సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

'పార్టీకి కష్టపడ్డ వారికి గుర్తింపు ఇవ్వాలి'

ఓబులవారిపల్లె, మార్చి 25: టీడీపీకి గత ఎన్నికలకు ముందు నుంచి కష్టపడిన రైల్వేకోడూరు టీడీపీ నాయకుడు పంతగాని నరసింహప్రసాద్‌కు ప్రాధాన్యత ఇవ్వకపోవడం అన్యాయమని పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ముక్కావారిపల్లె తురకపల్లి గ్రామ ముస్లిం నాయకులు బీసీఆర్ మస్తాన్, టీడీపీలోని పంతగాని అభిమానులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు పొత్తు పెట్టుకొని రైల్వేకోడూరులో గెలిచే అవకాశం ఉన్న నరసింహప్రసాద్‌కు కాకుండా ఇతరులకు ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. రైల్వేకోడూరులో టీడీపీ కార్యకర్తలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తురకపల్లి యువత పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

గాలివీడు, మార్చి 25: మండలంలోని గోరాన్‌చెరువు గ్రామ పరిధిలో గల పేరాలగుట్ట వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాయచోటి డివిజనల్ పంచాయతీరాజ్‌శాఖ అధికారుల ఆదేశాల మేరకు గోరాన్‌చెరువు పంచాయతీ సర్పంచ్ దీప్తి ఆదేశాల మేరకు 27న గురువారం ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వేలంపాటలో నిర్ణీత డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని, వీరు గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండకూడదని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దీప్తి, వార్డు సభ్యులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్‌తో ప్రాణదానం

చిన్నమండెం, మార్చి 25: మండల కేంద్రంలోని స్థానిక పశువైద్యశాలలో ఒక గొర్రెకు ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడినట్లు పశువైద్యుడు గణేశ్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... వండాడి గ్రామ పంచాయతీకి చెందిన వెంకట్రమణకు చెందిన గొర్రె కడుపులో రెండు రోజుల క్రితం పిల్ల చనిపోవడంతో ఆ రైతు గొర్రెను ఆసుపత్రికి తీసుకువచ్చాడు. వైద్యుడు ఆపరేషన్ చేసి గొర్రెను, పిల్లను వేరు చేయగా పిల్ల మరణించి ఉందని గొర్రె మాత్రం ఆరోగ్యంగా ఉందని తెలిపారు. దీంతో రైతు వెంకట్రమణ మాట్లాడుతూ ఆపరేషన్ చేసి తీయడంతో కనీసం గొర్రెనైనా కాపాడుకోగలిగామని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డి నియామకంపై హర్షం

సుండుపల్లె, మార్చి 25: రాజంపేట ఎంపీ అభ్యర్థిగా మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని నియమించడంపై బీజేపీ నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రతిఒక్కరూ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. త్వరలో మూడు పార్టీలు కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేసి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుబ్బరాజు, అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్, మండల నాయకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్రమణ్యం



ఏ.వి.సుబ్రమణ్యం (ఫైల్)

నందలూరు, మార్చి 25: నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏ.వి.సుబ్రమణ్యంను న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక కోర్టులో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలలో వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ మహమ్మద్ అలీ, సెక్రటరీగా జి.సుబ్బరాయుడు, జాయింట్ సెక్రటరీగా నాయనపల్లి అనుదీప్ జయసింహ, ట్రెజరర్‌గా సయ్యద్ మహమ్మద్ అలీ, కల్చరల్ స్పోర్ట్స్ సెక్రటరీగా వినయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఓ.వి.కృష్ణారెడ్డి, మల్లికార్జున, ఆనంద్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు దాసరి నరసింహులు, ఏజీపీ షమీవుల్లా ఖాన్, న్యాయవాది నూర్ మహమ్మద్, మోహన్‌లు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో ఘనంగా పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, మార్చి 25: దక్షిణకాశీగా పేరుగాంచిన పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాఢవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చక స్వాములు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

చంద్రబాబునాయుడుతో మేడా బాబు భేటీ



కుప్పం పర్యటనలో చంద్రబాబును కలిసిన మేడా విజయశేఖర్‌రెడ్డి

రాజంపేట, మార్చి 25: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. సోమవారం కుప్పం పర్యటనలో ఉన్న ఆయనను విజయశేఖర్‌రెడ్డి కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్టు తనకు ఇస్తే 30 వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందుతానని, కావున తనకు టికెట్టు ఇవ్వాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన చంద్రబాబు తాము పార్టీ తరపున అన్ని రకాల గెలుపు గుర్రాల కోసం సర్వే చేస్తున్నామని, ఎవరికి గెలుపు అవకాశం ఉంటే వారికే టికెట్టు ఇస్తామని చెబినట్లు తెలిపారు.

చేనేత కుటుంబానికి పలువురు ఆర్థిక సాయం

ఒంటిమిట్ట, మార్చి 25: కొత్త మాధవరం గ్రామంలో చేనేత కుటుంబం ఆత్మహత్యకు పాల్పడటంతో ఆ కుటుంబానికి పలువురు టీడీపీ నాయకులు ఆర్థిక సాయం ప్రకటించారు. రాజంపేట టీడీపీ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి సోమవారం ఉదయం టీడీపీ నాయకులతో కలిసి పరామర్శించారు. కుటుంబానికి రూ.20 వేల నగదును అందజేశారు. కర్నూలు పార్లమెంటు సభ్యుడు డాక్టర్ సంజీవ్‌కుమార్ రూ.లక్ష, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి రూ.50 వేలు, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తరపున హరినాథ్‌రెడ్డి రూ.50 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. వీరితో పాటు రాజకీయ పార్టీ ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలుకూరు దత్తాత్రేయులు, డాక్టర్ శివ, మోదుగుల నరసింహులు, చింతగింజల సుబ్రమణ్యం, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

- రైల్వేకోడూరు ఇన్‌ఛార్జ్ గోశాలదేవి

రైల్వేకోడూరు, మార్చి 25: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రైల్వేకోడూరు ఇన్‌ఛార్జ్ గోశాలదేవి తెలిపారు. సోమవారం రైల్వేకోడూరులో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విలువలతో కూడిన పార్టీ అని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాబావాన్ని వ్యక్తం చేశారు. రైల్వేకోడూరులో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తామన్నారు. వైసీపీ చేసిన అన్యాయాలను ప్రజలకు వివరిస్తామన్నారు. టీడీపీ ముస్లిం నాయకులు మస్తాన్‌తో చర్చలు నిర్వహించారు. మహిళా నాయకురాలు మంజులమ్మ, అజీమ్ తదితరులతో కలసి చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కదిరి కాళ్ల శాంతయ్య, మండల అధ్యక్షులు సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చంద్రబాబు పూజలు

కుప్పం, మార్చి 25: చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం పీఈఎస్ హెలిప్యాడ్ చేరుకుంటేనే అక్కడి నుంచి నేరుగా కుప్పం పట్టణం కొత్త పేటలోని వినాయకస్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడినుంచి బయలుదేరి సమీపంలో ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయం చేరుకున్నారు. ఈ ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలతో కూడిన సారె సమర్పించారు. జీర్ణోద్ధరణ, ప్రతిష్ఠ మహా కుంభాభిషేకంలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ పూజారులు చంద్రబాబుకు అమ్మవారి ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న చంద్రబాబు

మీకు అన్యాయం జరగనివ్వను!

● ఇఫ్తార్ విందులో ముస్లింలతో చంద్రబాబు

కుప్పం, మార్చి 25: 'చరిత్ర చూడండి, మీకు మేలు చేయడం తప్ప ఏనాడూ అపకారం చేసిన చరిత్ర టీడీపీకి లేదు. నన్ను నమ్మండి. నేను సీఎంగా ఉన్నంత వరకూ మీకు అన్యాయం జరగనివ్వను' అని ముస్లిం సోదరులకు చంద్రబాబు భరోసా ఇచ్చారు. కుప్పంలోని కేవీఆర్ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం ఆయన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్డీయేతో కలిసి పనిచేశామన్నారు. అప్పట్లోనే ముస్లింలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తుచేశారు. కర్నూలులో ఉర్దూ యూనివర్శిటీ తీసుకొచ్చామన్నారు. అనంతర కాలంలో పేద ముస్లిం ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం షాదీతోఫా పేరుతో రూ.లక్ష ఇచ్చామన్నారు. ముస్లిం యువతకు ఉపాధికోసం రూ.3 లక్షలు ఇవ్వడమేకాక, అందులో రూ.లక్ష సబ్సిడీ ఇచ్చామని వివరించారు. మసీదులు, ఖబరస్తాన్‌లు, షాదీ మహల్‌లు అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడీ ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. మైనారిటీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు ఎక్కువైపోయాయన్నారు. నంద్యాలలో అబ్దుల్ బాషాను చంపేశారని, కడప జిల్లాలో ఒక ముస్లిం కుటుంబం ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారన్నారు. పలమనేరు నియోజకవర్గంలో ముస్లింల ఆడబిడ్డ చదువుకుని మంచి ర్యాంకు సాధించే ఆమెను అవమానాల పాలు చేసి ఆత్మహత్యకు పురికొల్పారని, పుంగనూరులో 12 మందిని అక్రమ కేసుల్లో జైలుకు పంపిన ఘనత కూడా వైసీపీదేనన్నారు. మసీదు స్థలం ఆక్రమణను ప్రశ్నించిన పాపానికి గుంటూరులో ఒక వ్యక్తిని వైసీపీ మూకలు దాడులు చేసి చంపేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పంలోనూ అనేక మంది ముస్లింలపైన కేసులు పెట్టి వేధించారన్నారు. ఇలాంటి దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలు చూసి, రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలనే మూడు పార్టీలు కలిసి ఎన్నికలకు వెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమం అందించాలన్నా కేంద్రం సాయం అవసరమన్నారు. వాళ్ల దగ్గరకి తాను వెళ్లలేదని, వాళ్లు పిలిస్తే వద్దనలేదని అన్నారు. 'మనసులో ఏమీ పెట్టుకోవద్దు. నేను ముఖ్యమంత్రిగా ఉండేంత వరకు మీకు అండగా ఉంటాను' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.



రూ.5.45 లక్షల కర్ణాటక మద్యం స్వాధీనం

- ఇద్దరి అరెస్టు



సీజ్ చేసిన మద్యంతో ఎస్ఈబీ పోలీసులు

కుప్పం, మార్చి 25: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5.45 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కుప్పం ఎస్ఈబీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుడుపల్లె మండలం సోడిగానిపల్లె వద్ద తమకు అందిన సమాచారంతో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఓ కారు కర్ణాటక సరిహద్దు నుంచి అనుమానాస్పదంగా రావడం గమనించి ఆపి, తనిఖీ చేశారు. అందులో కర్ణాటకకు చెందిన 30 బాక్సుల సిల్వర్ కప్ 90 ఎంఎల్ 2,880 టెట్రా మద్యం ప్యాకెట్లు, 60 బాక్సుల ఓసీ ఒరిజినల్ చాయిస్ 5,760 మద్యం ప్యాకెట్లు బయటపడ్డాయి. వీటిని కర్ణాటక నుంచి సోడిగానిపల్లెకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వాహనంలోని కర్ణాటక రాష్ట్రం కెంపాపురం గ్రామానికి చెందిన వెంకటేష్, గుడిపల్లె మండలం అనగానిపల్లెకి చెందిన ఏఎస్ మంజునాథ్‌లను అరెస్టు చేశారు. మద్యంతోపాటు కారును, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.5.45 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబీ సీఐ సృజన బాబు, ఎస్ఐ అన్వేశ్, హెడ్ కానిస్టేబుళ్లు నాగరాజ్, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు ఉమాహేశ్, దేవేంద్ర, మధు, రఘు పాల్గొన్నారు. సిబ్బందిని చిత్తూరు సెబ్ డీఎస్ఈవో సుబ్బరాజు అభినందించి, క్యాష్ రివార్డులు అందజేశారు.

పుంగనూరులో రూ.2.14 లక్షల సీజ్

పుంగనూరు, మార్చి 25: సరైన బిల్లులు, నగదుకు సంబంధించిన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2,14,200 సీజ్ చేసి కలెక్టరేట్‌లో డిపాజిట్ చేసినట్లు పుంగనూరు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. సోమవారం పుంగనూరు సమీపంలోని మాగాండ్లపల్లె చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి రామసముద్రం వెళ్లే కారును పరిశీలించారు. అందులో ఉన్న కర్ణాటకకు చెందిన కలీం, అబ్దుల్‌బాషాల వద్ద రూ.2,14,200కు బిల్లులు అడగ్గా లేవని, తాము పుచ్చకాయ వ్యాపారులమని చెప్పారు. ఆధారాలు లేకుండా ఎన్నికల కోడ్ సమయంలో డబ్బులు తీసుకెళ్లరాదన్నారు. వారంలోగా ఆధారాలు చూపి డబ్బు తీసుకెళ్లవచ్చని, వారి నుంచి నగదు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

సదరం క్యాంపులో విచిత్రంపై డీసీహెచ్ఎస్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుంగనూరు, మార్చి 25: పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సదరం క్యాంపునకు వచ్చినట్లు, వికలత్వం లేకపోయినా కడప జిల్లాకు చెందిన అమరనాథ్‌నాయక్‌కు సర్టిఫికెట్ జారీ కావడంపై చిత్తూరు డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఆరా తీశారు. 'పుంగనూరు సదరం క్యాంపులో విచిత్రం' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన డీసీహెచ్ఎస్ దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన ఆచారితో మాట్లాడి, నివేదిక ఇవ్వాలని సూచించారు. మానవ తప్పిదం కారణంగా వేరే రోగి వివరాలు అమరనాథ్ నాయక్ పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. దీనిపై డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ.. సోమవారం సెలవు కావడం వల్ల.. మంగళవారం సర్టిఫికెట్ రద్దు చేయిస్తామని చెప్పారు.

కొనసాగిన ఇంటర్ మూల్యాంకనం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 25: ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం కొనసాగింది. ఈనెల 18న ప్రారంభమైన మూల్యాంకనం ప్రక్రియ ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగనుంది. అందులో భాగంగా సోమవారం జరిగిన మూల్యాంకనంలో 44 మంది ముఖ్య పరీక్షలు, 224 మంది సహాయక పరీక్షకులు పాల్గొన్నట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. ఇదిలా ఉండగా, టెన్త్ జవాబు పత్రాల డీకోడింగ్ ప్రక్రియ స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగింది. ఏప్రిల్ ఒకటి నుంచి టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం జరగనుంది. కాగా ఏప్రిల్ 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సమ్మెటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు జరగనున్నాయి.

కాణిపాకంలో సత్యనారాయణస్వామి వ్రతం



ఐరాల(కాణిపాకం), మార్చి 25: కాణిపాకంలోని వరదరాజస్వామి ఆలయంలో సోమవారం ఉదయం పౌర్ణమి సందర్భంగా మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. అనంతరం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి కాణిపాకం పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చల్లా బాబును గెలిపించుకురండి

టీడీపీ శ్రేణులకు చంద్రబాబు పిలుపు - వైసీపీనుంచి టీడీపీలో చేరిన వెంకటరమణరాజు

పుంగనూరు, మార్చి 25: పుంగనూరు అసెంబ్లీ ఎన్నికల్లో చల్లా బాబు (రామచంద్రారెడ్డి)ని గెలిపించుకుని రావాలని పార్టీ శ్రేణులకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి కుప్పం టీడీపీ కార్యాలయంలో చల్లా బాబు మాజీ సీఎంను కలిశారు. ఈ సందర్భంగా గతంలో రెండు పర్యాయాలు పుంగనూరు టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెంది.. 2019 ఎన్నికల సమయంలో వైసీపీలో చేరిన ఎం.వెంకటరమణరాజును చంద్రబాబు టీడీపీలోకి ఆహ్వానిస్తూ పార్టీ కండువా కప్పారు. పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డిని లైట్‌గా తీసుకోవద్దని, చల్లా బాబు గెలుపుకోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వెంకటరమణరాజు అన్నారు. అందుకు చంద్రబాబు మాట్లాడుతూ.. పుంగనూరులో గతంకంటే పార్టీ పరిస్థితి బాగుందన్నారు. అయినా 'మీరు చేయాల్సింది మీరు చేయండి, నేను చేసేది నేను చేస్తా' అన్నారు. అలాగే పుంగనూరు పుంగనూరు మున్సిపల్ కౌన్సిలర్ ఎం.రామకృష్ణమరాజు, వైసీపీ యువ నాయకులు ఆర్వీటీ బాబు, ఎం.ప్రదీప్‌రాజులకు కూడా టీడీపీ కండువాలను చంద్రబాబు కప్పారు. టీడీపీ గెలుపుకోసం పనిచేయాలని, రాబోయేదీ మన ప్రభుత్వమేనని భరోసా ఇచ్చారు. నాయకులు దినేశ్, గువ్వల రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటరమణరాజును టీడీపీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు
● చంద్రబాబు పరామర్శ





చలమయ్య మృతదేహం వద్ద చంద్రబాబు - నాగభూషణం ఆరోగ్య పరిస్థితిపై మాట్లాడుతున్న చంద్రబాబు

కుప్పం రూరల్, మార్చి 25: చంద్రబాబు బహిరంగ సభకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఒక కార్యకర్త మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామకుప్పం మండలం అనిగానూరు గ్రామానికి చెందిన చలమయ్య, నాగభూషణం సోమవారం సాయంత్రం కుప్పంలో జరిగిన చంద్రబాబు సభకు హాజరయ్యారు. తర్వాత స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కుప్పం మండలం గుట్టపల్లె వద్ద వీరిని ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం స్థానికులు వీరిని పీఈఎస్ ఆస్పత్రిలో చేర్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ సుమారు రాత్రి 8 గంటల ప్రాంతంలో చలమయ్య (32) మృతి చెందారు. నాగభూషణం చికిత్స పొందుతున్నారు. కాగా, చంద్రబాబు రాత్రి పది గంటల ప్రాంతంలో పీఈఎస్ ఆస్పత్రికి వెళ్లి చలమయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. చికిత్స పొందుతున్న నాగభూషణాన్ని చూసి.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

రూ.12 లక్షల వెండి ఆభరణాలు స్వాధీనం

చిత్తూరు, మార్చి 25: అక్రమంగా తరలిస్తున్న రూ.12 లక్షలు విలువ చేసే 15కేజీల వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను రెండో పట్టణ సీఐ ఉలసయ్యతో కలిసి డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి సోమవారం మీడియాకు వివరించారు. సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఇరువారం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగళూరు వైపు నుంచి చిత్తూరుకు వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, కృష్ణాజిల్లా లక్ష్మీపురం పోరంకికి చెందిన ఫణీంద్ర (42) ఎలాంటి రశీదులు లేకుండా రూ.12లక్షల విలువ చేసే 15 కేజీల వెండి తీసుకొస్తున్నారు. వెండి వస్తువులకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతోనే సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వాటికి సరైన బిల్లులను చూపించి, వెండి వస్తువులను తీసుకెళ్లొచ్చన్నారు. వెండి వస్తువులు పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్ఐ ప్రసాద్, ఇక్బాల్, నగరపాలక సిబ్బంది గోపి, గోపాలకృష్ణ వర్మను డీఎస్పీ అభినందించారు.



వెండి ఆభరణాలను మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

నేడు సుప్రీం సీజే తిరుపతి రాక

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి ధనుంజయ వై చంద్రచూడ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం తిరుపతి రానున్నారు. కలెక్టరేట్‌కు అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం 9 గంటలకు బెంగళూరు నుంచీ విమానంలో బయల్దేరి 10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు తిరుపతి ఎస్వీయూలో లా కోర్సులు ప్రారంభించి పదేళ్ళవుతున్న సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ లీగల్ ఎడ్యుకేషన్ (న్యాయ విద్యలో కృత్రిమ మేధ) అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్కుషాపును ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించి న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు మహాలక్ష్మీ పావని, జేబీ గుప్తా తదితరులు కూడా హాజరు కానున్నారు.రాత్రి 8 గంటలకు బయల్దేరి తిరుమల చేరుకునే సీజే రాత్రికి అక్కడే బస చేస్తారు. బుధవారం వేకువ జామున కుటుంబంతో శ్రీవారిని దర్శించుకుని ఉదయం 9 గంటలకు బయల్దేరి తిరుపతి చేరుకుంటారు. 11.30 గంటలకు విమానంలో బయల్దేరి హైదరాబాదు వెళ్ళనున్నారు.

శ్రీపురంలో అచ్చెన్నాయుడు దంపతులు



చిత్తూరు కల్చరల్, మార్చి 25: రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు దంపతులు సోమవారం వేలూరు బంగారు గుడిలో మహాలక్ష్మీదేవికి పూజలు చేశారు. వారికి ఆలయ పీఆర్వో కల్యాణచక్రవర్తి స్వాగతం పలికి, పూజలకు ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు నారాయణి అమ్మను దర్శించుకుని, ఆశీస్సులు అందుకున్నారు. అచ్చెన్నాయుడు దంపతులకు ఆలయ ట్రస్టీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు తిరుమలకు చిరంజీవి

తిరుపతి అర్బన్, మార్చి 25: ప్రముఖ సినీనటుడు చిరంజీవి, ఆయన తనయుడు రాంచరణ్ కుటుంబ సభ్యులతో మంగళవారం తిరుపతికి రానున్నారు. ప్రత్యేక విమానంలో సాయంత్రం 4గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడినుంచి రోడ్డు మార్గంలో తిరుమల చేరుకుని రాత్రికి బసచేస్తారు. బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. సాయంత్రం హైదరాబాదుకు తిరుగుప్రయాణమవుతారు.

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి జరిగిన గరుడసేవలో పాల్గొన్న ఆయన నైవేద్య విరామ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, ప్రముఖ సినీ హీరో వెంకటేష్ కుమార్తె హయావాహిని దంపతులు శ్రీవారిని దర్శించుకున్నారు. కొత్తగా పెళ్లయిన హయావాహిని, నిషాంత్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.



శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ ఎన్వీ రమణ

తొలిరోజు చంద్రబాబు పర్యటన ఇలా....



సభలో మేడలెక్కిన అభిమానం

కుప్పం, మార్చి 25: సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుప్పం పీఈఎస్ హెలిప్యాడ్‌కు చంద్రబాబు చేరుకున్నారు. కొత్తపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఒంటి గంటకు పూజల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత టీడీపీ కార్యాలయానికి చేరుకుని అరగంట పాటు బస్సులో భోజన విరామం తీసుకున్నారు. 1.45 నుంచి 2.55 గంటల దాకా మహిళా కుటుంబ సాధికార కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. 2.55 నుంచి సాయంత్రం 3.45 గంటలదాకా పార్టీ కార్యాలయంలో నాయకులతో మంతనాలు జరిపారు. ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో సాయంత్రం 4 నుంచి సాయంత్రం 5.30 గంటలదాకా బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు వెళ్లారు. అక్కడ్నుంచి కేవీఆర్ కల్యాణ మండపానికి చేరుకుని సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.15 గంటల దాకా ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అక్కడినుంచి టీడీపీ కార్యాలయం చేరుకుని రాత్రి సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమై ఎన్నికల్లో వ్యూహ రచనపై చర్చలు జరిపారు.

నేటి షెడ్యూల్ ఇదే

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు: కేవీఆర్ కల్యాణ మండపంలో వివిధ పార్టీలనుంచి చేరికలు

1- 1.30:	బాబు నగర్‌లో ఇంటింటి ప్రచారం
1.40- 2.30:	విరామం
2.30- 3.30:	టీడీపీ నాయకులతో సమీక్షా సమావేశం
4.30-5:	రామకుప్పం మండలం రాజుపేట గ్రామం వద్ద హంద్రీ-నీవా కాలువ పరిశీలన
సాయంత్రం 6- 7.45:	పార్టీ నాయకులతో సమావేశం
8.00:	ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో రాత్రి బస

రేపు పలమనేరులో ప్రజాగళం

● రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాలో ప్రారంభం
● విజయవంతం చేయండి: అమర్

పలమనేరు, మార్చి 25: టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం పలమనేరులో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చేపడుతున్న ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోనే తొలిసారిగా 27న ఉదయం 9.30 గంటలకు పలమనేరు జవుళి వీధిలో కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. రోజూ మూడు నుంచి నాలుగు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటిస్తారని తెలిపారు. ప్రజలు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందులు పడుతున్నారో తెలుసుకుని.. వారి గళాన్ని రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేయడమే ఈకార్యక్రమ ముఖ్యఉద్దేశమన్నారు. దాంతోపాటు జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే జరిగే పరిణామాలను ప్రజలకు వివరించడంతోపాటు ఈ ఐదేళ్లలో అరాచక పాలనను తెలియజేయడం జరుగుతుందన్నారు. అందువల్ల నియోజకవర్గ ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, నాయకులు రామచంద్రనాయుడు, ఖాజాపీర్, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు

తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 80,532 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 29,438 మంది తలనీలాలు సమర్పించారు.

చెట్టుపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

కురబలకోట, మార్చి 25: చెట్టుపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ నార్లపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి భార్య లక్ష్మీదేవమ్మ(56) గ్రామ సమీపంలోని తమ పొలంలో ఉన్న చింతచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారీ కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబీకులు ఆమెను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్సల నిమిత్తం రుయాకు తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.1.20 లక్షలు స్వాధీనం


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కురబలకోట, మార్చి 25: వాహనాల తనిఖీల్లో రూ.1.20 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ సద్గురుడు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్ళులో జాతీయ రహదారిపై వాహనాలను పోలీసులు తనిఖీ నిర్వహించారు. కాగా పోలీసుల తనిఖీల్లో బెంగళూరు నుంచి కడపకు వెళుతున్న ఓ కారులో నగదు పట్టుబడింది. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేకుండా పోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

బి. కొత్తకోట, మార్చి25: నాటుసారా తయారుచేసి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. బి కొత్తకోట మండలంలోని గోళ్లపల్లి పంచాయతీ పరిధిలోని నల్లంకివారిపల్లి సమీపంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లగా ఓ చెట్టుక్రింద అక్రమంగా సారా విక్రయిస్తున్న నల్లంకివారిపల్లికి చెందిన కె.సుబ్బన్న(63)తో పాటు, దిన్నిమీదపల్లెకు చెందిన ఎ.నాగార్జునరెడ్డి(32), టి.ఆనందరెడ్డి(43) లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి 24 లీటర్ల నాటుసారాను స్వాధీనంచేసుకున్నారు. నిందితులను తదుపరి చర్య నిమిత్తం రిమాండుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. మండలంలో సారా విక్రయాలు ఎక్కడ జరుగుతున్నా సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు

మదనపల్లె టౌన్, మార్చి 25: పొలం వద్ద స్టార్టర్ మరమ్మతులు చేస్తున్న రైతు విద్యుదాఘాతంతో గాయాలపాలయ్యాడు. చౌడేపల్లె మండలం కాటిపేరి గ్రామానికి చెందిన రైతు సుబ్రమణ్యం(65) సోమవారం తన పొలంలో నీరుకడుతుండగా బోరు స్టార్టర్ మరమ్మతు కావడంతో వెళ్లి స్టార్టర్ డోర్ తీశాడు. ఇంతలో పెద్దగా మంటలు రావడంతో పాటు సుబ్రమణ్యం విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

చింతలవారిపల్లె వాసికి పీహెచ్‌డీ ప్రదానం


పీహెచ్‌డీ పొందిన ఎస్.కుందన

గుర్రంకొండ, మార్చి 25:గుర్రంకొండ మండలం టి.రాచపల్లె పంచాయతీ చింతలవారిపల్లెకు చెందిన ఎస్.కుందన భారతి దాసన్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీని అందుకున్నారు. హైదరాబాదులోని బి.వి.రాజు.ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆమె భారతిదాసన్ విశ్వ విద్యాలయం నుంచి రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పొందారు. ఈమె నానోకంపోజిట్ పాలిమర్ ఎలక్ట్రోలైట్స్: అప్లికేషన్ టు సెన్సార్స్ అనే అంశంపై డాక్టర్ వెంకటపతి ఆధ్వర్యంలో పరిశోధన చేశారు. ఈమె పరిశోధనలను గుర్తించిన యూనివర్సిటీ ఈనెల 21 పీహెచ్‌డీని ప్రదానం చేసింది. పీహెచ్‌డీ అందుకున్న కుందనను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

పీలేరు రచయితకు ఘనసన్మానం



పీలేరు, మార్చి 25: తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు, పీలేరుకు చెందిన ప్రముఖ కవి, రచయిత అయిన జలకనూరి మురళీధర్ రాజుకు ఆదివారం తిరుపతిలో ఘనసన్మానం లభించింది. తిరుపతిలోని శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియంలో 'జానపద స్వరగానం' కార్యక్రమం జరిగింది. నిర్వాహకుల ఆహ్వానం మేరకు అందులో పాల్గొన్న మురళీధర్ రాజు తాను రచించిన 'గాజుల పాట' జానపద గేయాన్ని ఆలపించి ఆహుతులు, నిర్వాహకుల మన్ననలు అందుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ప్రముఖ కవులు, రచయితలు అయిన అరవ ధనపాల్, పార్థసారథి, ధనాశి ఉషారాణి, రాళ్లపల్లె రజనీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మురళీధర్ రాజును స్థానిక తెలుగు భాషాభిమానులు, రచయితలు అభినందించారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం

- టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేయండి
- పార్టీ శ్రేణులకు టీడీపీ,జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 24: రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధినేత నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని అదే లక్ష్యంతోనే అందరూ సమష్టిగా పనిచేయాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ పథకాలైన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని ఆయన పార్టీశ్రేణులకు పిలుపు నిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ములకలచెరువు, తంబళ్లపల్లె, కురబలకోట మండలాల క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, పోలింగ్ బూత్‌ల కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, ప్రతి ఏటా రైతులకు రూ.20వేలు ఆర్థిక సహాయం, యువతకు 20లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి పథకాలపై ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలన్నారు. పోలింగ్ బూత్‌ల పరిధిలో జరుగుతున్న శంఖారావం కార్యక్రమాన్ని విధిగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటికి తిరిగి వచ్చే నెల 10వతేదీ లోగా ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ పేరుతో బడుగు, బలహీన వర్గాలను భూములు లాక్కొని వారికి పొట్టనపెట్టుకుంటున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. అనంతరం వర్క్‌షాప్‌లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేసిన విషయాలను వివరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు గురవారెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్దా, వైజీ సురేంద్ర యాదవ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్, మాజీ ఎంపీపీలు భూమిరెడ్డి, తిమ్మరాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాధరెడ్డి, టీడీపీ నేతలు ముత్తకూరు మౌలా, కేశవులు, యర్రగుడి సురేష్, విజ య్‌కుమార్, రామకృష్ణమరాజు, తంబాళ్ళ శివన్న, నాయకులు భజంత్రి రామాంజులు, గాండ్ల రెడ్డెప్ప, చాంద్‌బాషా, నాగేంద్ర, గంగాదేవి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తంబళ్లపల్లె కూటమి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి

ఎన్నికల్లో ఆదరించండి.. అభివృద్ధి చేసుకుందాం

పెద్దతిప్పసముద్రం మార్చి 25 :ఎన్నికల్లో ఆదరించి.. గెలిపిస్తే తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామంటూ నియోజకవర్గ టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండలంలోని మడుమూరు పంచాయతీలోని వివిధ గ్రామాల్లో పర్యటించి కూటమి గెలుపునకు ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేసి తనను అభ్యర్థించారు. ఆయన సోమవారం అములదారునిపల్లెలో టీడీపీ సీనియర్ నాయకులను కలిసి తనకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ- జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, మార్చి 25: తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని..బోధన ఆంగ్ల మాధ్యమంలో ఉంటుదన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://ఏపియంఎస్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 28వ తేది నుంచి మే 22 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.200లు, ఎస్సీ, ఎస్టీలకు రూ150లు నెట్‌బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చన్నారు. పదో తరగతి మార్కులు మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలుంటాయని పేర్కొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : మండల కేంద్రమైన ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలకు ధరఖాస్తులను ఆహ్వానిస్తూ మండల విద్యాశాఖాధికారి నారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులలో ప్రవేశాలు కల్పించడంతో పాటు ఆంగ్లమాధ్యమంలో ఉచితంగా విద్యాబోధనను అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆయా జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులను ఈ నెల 28 నుంచి మే 22 వరకు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 150 రుసుము చెల్లించాలన్నారు. అనంతరం విద్యార్థికి కేటాయించే జనరల్ సెంటర్ ఆధారంగా మార్కుల మెరిట్ రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రామసముద్రంలో: మండలంలోని ఊలపాడు పంచాయతీ దిన్నెపల్లి సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో 2024-25విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రవేశ ప్రక్రియకు పదోతరగతి అర్హత ఉన్న విద్యార్థుల నుంచి మార్చి 28 నుంచి మే 22 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మునిస్వామినాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పది మార్కుల మెరిట్, రిజర్వేషన్లు, ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని విద్యార్థులు నిర్ణీత తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఏపీ మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో..

వాల్మీకిపురం, మార్చి 25:ఏపీ మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో 2024- 25 విద్యా సంవత్సరానికి గానూ జూనియర్ ఇంటర్మీడియేట్ కోర్సులో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రమామంజుల ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్చిలో పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థినులు మాత్రమే అర్హులని, మైనార్టీ విద్యార్థినులకు మే 1 నుంచి ప్రవేశ పరీక్ష లేకుండా కళాశాలలో నేరుగా చేరే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ బాలికలు 2024 ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్‌కు ఈనెల 31లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఏప్రిల్ 25న అన్ని జిల్లా కేంద్రాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9390614106 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్లకు గడువు పొడిగింపు

కలికిరి, మార్చి 25: విద్యా హక్కు చట్టం మేరకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం గడువు పొడిగించినట్లు కలికిరి ఎంఈవో కరీముల్లా తెలిపారు. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాస రావు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు పొందడం కోసం అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన పిల్లలు దరఖాస్తులు పంపుకోవడానికి గడువును ఈ నెల 31వ తేదీ వరకూ పొడిగించినట్లు ఎంఈవో పేర్కొన్నారు. విద్యార్థుల నివాసాలకు సమీపంలో వుండే ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, రాష్ట్ర సిలబస్‌ను అనుసరిస్తున్న అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం కోటా కింద ప్రవేశాలకు ఆసక్తి కలిగిన విద్యార్థులు సమీపంలోని సచివాలయం, ఇంటర్‌నెట్ కేంద్రాం, ఎంఈవో కార్యాలయం, మీ సేవా కేంద్రాల నుంచి దరఖాస్తులు పంపుకోవచ్చని, ఇతరత్రా వివరాల కోసం టోల్ ఫ్రీ నంబరు 1800 4258 599లో సంప్రదించవచ్చని ఎంఈవో వివరించారు.

నరసింహస్వామి ఆలయంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు


గొందిపల్లె సమీపంలోన్ని కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దతిప్పసముద్రం మార్చి 25 : మండలంలోని మల్లెల పంచాయతీ గొందిపల్లె సమీపంలోని కదిరిదేవునిగుట్టల్లో వెలసిన కదిరి నరసింహస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమిని పురష్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లోని పలువురు తమ ఇలవేల్పు దేవుడైన కదిరి దేవుని దర్శించుకునేందుకు ఆలయంలో బారులు తీరారు. పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి ఆలయం వద్ద చెక్కలకోలాటలు, హరిభజనలు, కోలాహలంగా జరిగాయి. రాత్రి వేళలో హరికథ కాలక్షేపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కర్ణాటక సరిహద్దు గ్రామమైన యనమాలపాడి, బట్లపల్లె తది గ్రామాల నుంచి భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

శివాలయంలో విశేష పూజలు

పెద్దతిప్పసముద్రం మార్చి 25 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కదిరి పౌర్ణమిని పురష్కరించుకుని ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య అద్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ఉదయం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు పానకం, వడపప్పుతో పాటు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి పీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

29న మహాకుంభాభిషేకం


ఆలయ గోపురానికి రంగులు వేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, మార్చి 25: స్థానిక చిప్పిలి గ్రామంలో వెలసిన మడియక్కల శివాలయంలోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు కుంభాబిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రమణ తెలిపా రు. ఈ సందర్భంగా మీడియాతో ఈవో రమణ, ఆలయప్రధాన అర్చ కుడు విశ్వేశ్వరప్రసాద్‌లు మాట్లాడు తూ ఆలయంలో శతచండీ పారా యణ పూర్వక మహారుద్రయాగ సంప్రోక్షణ మహాకుంభాబిసేకం నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భం గా ఆలయంలోని గోపురాలకు రంగులతో ముస్తాబు చేస్తున్నారు.

వీరభద్రాలయంలో ఘనంగా పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, మార్చి 25: దక్షిణకాశీగా పేరుగాంచిన పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాడవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చక స్వాములు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

దోస పంటకు ఎల్లోమజాక్ దెబ్బ

బి కొత్తకోట, మార్చి25: బి కొత్తకోట మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో సాగు చేసిన దోస పంటకు ఎల్లోమజాక్ వైరస్ సోకడంతో పంటబాగా దెబ్బతింటోంది. మండలంలోని చంద్రమాకులపల్లె కు చెందిన సన్నకారు రైతు ప్రతి ఏడాది రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకుని దోస, కర్బూజా పంటలను సాగు చేసేవాడు. ఈ ఏడాది కూడా తన రెండెకరాల పొలంలో దోసపంటను సాగు చేశాడు. పంట పెట్టి 30 రోజులు కావస్తోంది. రూ.33వేలు పెట్టి విత్తనాలు కొనుగోలు చేయడంతోపాటు, దుక్కి, డ్రిప్, మల్చింగ్ పేపరుతో పాటు, కూలీలు, రసాయన ఎరువులు, మందుల స్ప్రేయింగ్ కోసం ఇప్పటిదాకా 1.80 లక్షలు ఖర్చు చేశాడు. ఇప్పుడు ఎల్లోమజాక్ వైరస్ సోకడంతో ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. చెట్లను పీకి పడేయడం తప్ప, మరో మార్గం లేదంటున్నాడు. కాగా ఇదే గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, డి. నాగరాజురెడ్డి రెండు ఎకరాలు, టి రామిరెడ్డి 1.50, యం వెంకట్రమణారెడ్డి 2.25, పి. సుబ్బిరెడ్డి 3 ఎకరాలు, యం క్రిస్నారెడ్డి ఆరు ఎకరాలు పి. బయ్యారెడ్డి నాలుగు ఎకరాలలో దోస పంటను సాగుచేసి నష్టపోయారు . వీరే కాదు మండల వ్యాప్తంగా, నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు దాదాపు 300 ఎకరాలలో ఎల్లోమజాక్ వైరస్ ధాటికి సుమారు రూ.4 కోట్ల నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు.

ఎల్లోమజాక్ వైరస్ అంటే...

ఉష్ణోగ్రత 37 డిగ్రీలకు మించినప్పుడు వేడితాకిడికి 20-25 రోజుల దోసపంటకు ఈ ఎల్లోమజాక్ వైరస్ సోకుతుంది. ఆకులలో వెనుకభాగాన కోడిపేను లాగా ట్రిప్స్ ఏర్పడతాయి. దానికి తోడు తెల్లదోమ రసాన్ని పీల్చేస్తుంది. ఫలితంగా దోసతీగ ఆకులన్నీ పసుపురంగులోకి మారి. ఎదుగుదల లేక పిందెలు రాలిపోతాయి. ఈ వైరస్‌కు ఎక్స్‌పో నస్, డెలిగేట్, గ్రేశియా లిక్విడ్‌లకు ఇతర కాంబినేసన్ కలిపి స్ప్రే చేస్తే వైరస్ అదుపు లోకి వచ్చేది. కానీ ప్రస్తుతం అదికూడా పనిచేయడం లేదని బాధితరైతు లు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి...

తంబళ్లపల్లి నియోజకవర్గంలో వైరస్ సోకి సుమారు 300 ఎకరాలలో దోసపంట దెబ్బతిందని రైతులు పేర్కొంటున్నారు. కొందరు దోసతీగలను తొలగించి, అదే పేపర్ మీద మరో పంటను నాటుతుండగా, మరికొందరు చివరి వరకు ప్రయత్నించి స్ప్రేయింగ్‌ల కోసం రూ. లక్షలు వెచ్చించి అప్పుల పాలవుతున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించాలని దోసపంట బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.


ఎల్లో మజాక్ వైరస్ సోకిన దోస తోట

కులాన్ని తాకట్టుపెట్టిన ముద్రగడ..

- పవన్, చిరంజీవిని మాట్లాడే అర్హతే లేదు
- పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఓడిస్తాం
- జనసేన నేత రామాంజనేయులు


మీడియాతో మాట్లాడుతున్న జనసేన నేతలు శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత

మదనపల్లె, మార్చి 25: బలిజ కులాన్ని వైసీపీకి తాకట్టు పెట్టిన ముద్రగడ పద్మనాభం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, చిరంజీవిని మాట్లాడే అర్హత లేదని జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక బర్మావీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలిజ, కాపు కులాన్ని అడ్డంపెట్టుకుని ముద్రగడ రాజకీయంగా ఎదిగినట్లు తెలిపారు. అలాంటి వ్యక్తి ఈరోజు కులాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీలో చేరి, మా అధినేతను విమర్శించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జనసైనికులతో పాటు బలిజ కులస్థులంతా ఇక్కడ మీ కుటుంబాన్ని ఓడిస్తామని హెచ్చరించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం వెళ్లి ఓడిస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చెప్పడం ఏంటని ప్రశ్నించారు. పుంగనూరులో మీనాన్న పెద్దిరెడ్డితోపాటు రాజంపేటలో పోటీ చేస్తున్న నీవు, తంబళ్లపల్లెలో మీ బాబాయ్‌లను ఓడిస్తామని రామాంజనేయులు స్పష్టం చేశారు. నాసేనకు నావంతు రాష్ట్రకమిటీ సభ్యులు, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత మాట్లాడుతూ ముద్రగడను బలిజ కులం అంతా ఛీ కొడుతోందన్నారు. సమావేశంలో జనసేన నేతలు దారం హరిప్రసాద్, నాయని జగదీష్, కొటకొండ చంద్రశేఖర్, గణేష్, రూప, సోను, సుప్రీం హర్ష, నవాజ్, అర్జున్, గంగాధర్, యాసిన్, శేఖర్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది


షాజహాన్‌బాషాను ఆహ్వానిస్తున్న సీనియర్ నేత మార్పూరి సుధాకర్‌నాయుడు

మదనపల్లె టౌన్, మార్చి 25: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక సొసైటీకాలనీలోని టీడీపీ సీనియర్ నేత మార్పూరి సుధాకర్‌నాయుడు నివాసంలో సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో ముగ్గురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షాజహాన్‌బాషా మాట్లాడుతూ మదనపల్లె పర్యటనలో చంద్రబాబు పలు అంశాలపై ప్రజలకు హామీ ఇవ్వనున్నారన్నారు. అనంతరం స్థానిక బుగ్గవంక వద్ద గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన ఆయన అక్కడ భక్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రబాబు పర్యటన విజయవంతంపై నియో జకవర్గంలోని 259 బూత్ ఇన్‌చార్జులు, ప్రధాన నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ ఎస్.విద్యాసాగర్, ఎస్ఏ మస్తాన్, దొరస్వా మినాయుడు, బీదపల్లె నారాయణ, ఈశ్వర్‌నాయుడు, రెడ్డిమంజునాథ్, గురునాథ్ యాదవ్ పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

పీలేరు, మార్చి 25: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు సాంబశివ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పీలేరులోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారిన బీజేపీని ఓడించకపోతే దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని, ప్రస్తుత ఎన్నికలే ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే చివరి ఎన్నికలు కాగలవని హెచ్చరించారు. మూడవసారి అధికారంలోకి వస్తే బీజేపీ భారత రాజ్యాంగాన్ని మార్చివేసి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. దేశాన్ని కాపాడుకోవాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు టీఎల్ వెంకటేశ్, నరసింహులు, శ్రీనివాసులు, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలు ఇలాగేనా..?


శిలాఫలకంలో ఉన్న రాజకీయ నేతల పేర్లు

మదనపల్లె టౌన్, మార్చి 25: అది మదనపల్లె పట్టణం నడిబొడ్డున ఉన్న బెంగళూరుబస్టాండులోని ఇందిర సర్కిల్ వద్ద ఇందిరమ్మ విగ్రహం ఉంది. నిత్యం వేలాది మంది ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. కాని ఇక్కడ ఇందిరమ్మ విగ్రహం ఏర్పాటు చేసిన శిలాఫలకంలో రాజకీయ నాయకుల పేర్లను మాత్రం అలాగే ఉంచేశారు. కనీసం కొంచెం పేపర్‌తో అయినా ఈ పేర్లు కనిపించకుండా మున్సిపల్ అధికారులు అంటించి ఉంటే బాగుండునని ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల కోడ్ అమలు ఇలాగేనా అంటూ పలువురు పెదవి విరుస్తున్నారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎంపిక

రామసముద్రం, మార్చి 25: రామసముద్రం మండలం బీజేపీ కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు మండల బీజేపీ అధ్యక్షుడు ఇంజమ్ ఆనందకుమార్‌నాయుడు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఆనందకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో 15మంది పదాధికారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులు మండలంలో బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలని, అలాగే రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఉమ్మడి మదనపల్లె అభ్యర్థి షాజహాన్‌బాషా గెలుపునకు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, నెల్లూరు యువమోర్చా ఇన్‌చార్జి శ్రీనివాస, యువమోర్చా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బెంగళూరులోని జీటీటీసీతో మిట్స్ ఒప్పందం


బెంగళూరులోని జీటీటీసీతో ఎంవోయు కుదుర్చుకున్న దృశ్యం

కురబలకోట, మార్చి 25: మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల బెంగళూరులోని గవర్నమెంట్ టూల్ రూమ్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్(జీటీటీసీ)తో ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకునట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ప్రిన్సిపాల్ ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్‌లు కలిసి ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అక్కడ ఇంటర్న్‌షిప్‌లు వర్క్‌షాప్, పరిశ్రమలలో జరుగుతున్న నూతన టెక్నాలజీలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కాగా విద్యార్థులు, అధ్యాపకులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి సహాయసహకారాలు అందివ్వనున్నట్లు తెలిపారు. ఐదేళ్ల పాటు ఎంవోయు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు కమాల్‌బాషా, రామనాథమ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హోళీ వేడుకలు


హోళీ సంబరాలు చేసుకుంటున్న చైతన్య అనాథాశ్రమ చిన్నారులు

మదనపల్లె టౌన్, మార్చి 25: మదనపల్లెలో పలుచోట్ల హోళీ పండుగను ప్రజలు రంగులు చల్లుకుంటూ వేడుకగా ఉత్సాహంగా నిర్వహించారు. సోమవారం స్థానిక దేవతా నగరల్‌లోని చైతన్య అనాథాశ్రమంలో నిర్వా హకులు ఎం. ఆనందన్ ఆధ్వర్యంలో చిన్నారులు రంగు రంగుల పూలను చట్టుకుంటూ హోళీ నిర్వహించారు. చెడుపై మంచి గెలవడాన్ని ప్రతీకగా ప్రజలు హోళీ పండుగ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కవితరాణి, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

పీలేరులో: హోళీ పండుగను సోమవారం పీలేరులోని మార్వాడీలు, రాజస్థాన్ వాసులు ఘనంగా జరుపుకున్నారు. పీలేరు పట్టణంలో గణనీయం సంఖ్యలో ఉన్న వారు సోమవారం తమ దుకాణాలను మూసివేసి ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు.


రంగులు చల్లుకుంటున్న రాజస్థాన్ వాసులు